క్లుప్తంగా

సమన్వయంతో పని చేయాలి

కరకగూడెం: సీజనల్ వ్యాధులు పట్ల ప్రజలను అప్రమత్తం చేస్తూ అవి ప్రబలకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కరకగూడెం ఎంపీపీ రేగా కాళిక సూచించారు. ఈ మేరకు ఆమె బుధవారం మండల ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ.. ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచించారు. సమావేశంలో స్థానిక ప్రభుత్వ వైద్యాధికారి కారం మధు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ దేవ వర కుమార్, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్స్, ఆశ వర్కర్లు, అధికారులు పాల్గొన్నారు.

బిల్లులు విధిగా తీసుకోండి

ములకలపల్లి: విత్తనాల కొనుగోలు సమయంలో బిల్లులు ఖచ్చితంగా తీసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి (ఎంఏఓ) కరుణామయి రైతులకు సూచించారు. మండలకేంద్రంలోని గుడ్‌షపర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అనంతరం రాజుపేట శివారులోని వ్యవసాయక్షేత్రంలో రైతు చిలకపాటి చందర్‌రావు ఏర్పాటు చేసిన తేనెటీగల పెంపకం సాగును క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

వరదను నివారించాలి

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని బేస్ వర్క్‌షాప్‌లోకి వరద నీరు చేరకుండా ముంపు నివారణ చర్యలు చేపట్టాలని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై.రాంగోపాల్, ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి సిల్వేరు గట్టయ్యలు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బేస్‌వర్క్‌షాప్ క్యాంటీన్‌లోకి చేరిన బురద మట్టిని బుధవారం వారు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నాయకులు రవికుమార్, పెద్ద నాగయ్య, ఫిట్ కమిటీ సభ్యులు, సేఫ్టీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతులు

అన్నపురెడ్డిపల్లి: సీతారామ ప్రాజెక్ట్ కాలువ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతుల భూములకు నష్టపరిహారం చెల్లించాలని, ఈ మేరకు చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు నిర్వాసిత రైతులు వినతిపత్రం ఇచ్చారు. బుధవారం గండుగులపల్లిలోని ఎమ్మెల్యే నివాసంలో భూ నిర్వాసిత రైతులు ఎమ్మెల్యేను కలిసి విన్నవించారు. నాయకులు చల్లా పుల్లయ్య, నిర్వాసిత రైతులు యాదాల వెంకన్న, చింతం నరిసింహారావు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: గిరిజన సంక్షేమ శాఖ విద్యాసంస్థల్లో పని చేసే తెలుగు, హిందీ భాషా ఉపాధ్యాయులతోపాటు వ్యాయామ ఉపాధ్యాయులను అప్‌గ్రేడ్ చేసి పదోన్నతులు కల్పించాలని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు వినతి చేశారు. బుధవారం అశ్వారావుపేటలో రాష్ట్ర గిరిజన సంక్షేమ పండిత, పీఈటీ ఉపాధ్యాయుల సంఘం బాధ్యులు ఎమ్మెల్యేను కలిసి వినతి చేశారు. ఎమ్మెల్యేను కలిసి వారిలో సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు చిట్టిబాబు, హరి కిషన్, రవి, దాసు, మోహన్‌లాల్ ఉన్నారు.

త్వరితగతిన పూర్తి చేయాలి

ములకలపల్లి: ములకలపల్లి, తాళ్లపాయ మధ్య ఉన్న పాములేరు వాగుపై చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సీపీఐ మండల కార్యదర్శి ఎండి.యూసఫ్ కోరారు. బుధవారం క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించిన ఆయన మాట్లాడారు. సీపీఐ మండల సహాయ కార్యదర్శి నరాటి రమేశ్, మాజీ వార్డు సభ్యుడు వాంకుడోత్ వీరునాయక్, అనుమల సాయి తదితరులు ఉన్నారు.

వైద్యశిబిరం

చర్లరూరల్: చర్ల మండలం సత్యనారాయణపురం పీహెచ్‌సీ పరిధిలోని మారుమూల గ్రామమైన రామచంద్రాపురంలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలో వారికి వైద్య చికిత్సలు అందించిన వైద్యాధికారిని దివ్యనయన.. వారికి కావలసిన మందులను అందజేశారు. హెచ్‌ఈఓ బాబూరావు,యంఎల్‌హెచ్‌పి జె.సంధ్య, ఏఎన్‌యం జి.రాజేశ్వరి, హెల్త్ అసిస్టెంటు వరప్రసాద్, ఆశా కార్యకర్త కనకమ్మ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు విడుదల చేయండి

భద్రాచలంఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆసరా పింఛన్లు లబ్ధిదారుల అకౌంట్లో వెంటనే జమ చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అన్నారు. పట్టణంలోని మనుబోతుల చెరువు కాలనీలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు సున్నం గంగా, పట్టణ కమిటీ సభ్యుడు జి.లక్ష్మణ్, పార్టీ సభ్యులు చిట్టెమ్మ, సక్కుబాయి, బాయమ్మ, సీనమ్మ సత్యనారాయణ పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో ఇసుక అక్రమంగా నిల్వ చేసిన వారిపై చర్యలు తీసుకుని ఇసుకను స్వాధీనం చేసుకోవాలని ఆదివాసీ మహాజన సమితి మహిళ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కంగాల రమణకుమారి డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్‌కు సంఘం ఆధ్వర్యంలో బుధవారం వినతి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు పలక ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

ముంపునకు శాశ్వత పరిష్కారమేది?

- 2022 వరదలతో తీవ్ర నష్టం
- ఈ ఏడాది ఎలా ఉంటుందోనని స్థానికుల్లో భయాందోళన
- శాశ్వత పరిష్కారం కోసం ఎదురుచూపులు



వరదనీటిలో మునిగిన సున్నంబట్టి గ్రామంలోని ఓ ఇల్లు (ఫైల్)



పర్ణశాలలో వరదలతో కొట్టుకుపోయిన చిరు వ్యాపారి దుకాణం (ఫైల్)

దుమ్ముగూడెం: వర్షాకాలం మొదలైంది ఈసారి రుతుపవనాలు కాసింత ముందుగా ప్రవేశించడంతో గతేడాది కన్నా అధిక వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సంకేతాలిస్తోంది. ఈ నేపథ్యంలో వర్షాకాలం మొదలైందటేనే మండలంలోని వరద ప్రాభావిత గ్రామాల ప్రజల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. 2022 జూలైలో సంభవించిన గోదావరి వరదలతో మండలంలో తీవ్ర ఆస్తినష్టం సంభవించి ముంపు గ్రామాల ప్రజలు కట్టుబట్టలతో మిగిలిన సంగతి విధితమే. ప్రాణ నష్టం లేనప్పటికీ పైసాపైసా కూడబెట్టుకుని జీవితం కొనసాగిస్తున్న బడుగు వర్గాలపై వరదలు తీవ్ర ప్రతాపం చూపింది. ఈ యేడు కూడా వర్షాకాలం ప్రారంభమయినప్పటికీ ముందస్తు చర్యలు తీసుకోవడంలో అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. వరద ప్రభావిత ప్రాంతాల్లో శాశ్వత చర్యలు చేపట్టకపోవటం, కనీసం ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవటంతో బాధితులు లబోదిబోమంటున్నారు.వరదలు వచ్చినప్పుడు పునరావాసకేంద్రాలకు తరలిద్దాం అనే ఆలోచన తప్ప శాశ్వత పరిష్కారం వైపు పాలకులు కానీ అధికారులు కానీ చూడడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆచరణకు నోచుకోని ప్రతిపాదనలు

2022లో వచ్చిన వరదలకు మండలంలోని సున్నంబట్టి, కాశీనగరం గ్రామాలు తుడిచిపెట్టుకుని పోగా.. పర్ణశాల, ఎల్ ఎన్‌రావుపేట, వర్క్‌షాపు, దుమ్ముగూడెం, గంగోలు, రేగుబల్లి, తూరుబాక గ్రామాలు వరద ముంపుకు గురై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గోదావరి వరదల అనంతరం ముంపుకు గురైన గ్రామాలను అప్పటి మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సందర్శించి గోదావరి వరద ముంపు గ్రామాల ప్రజలకు మైదాన ప్రాంతాల్లో పునరావాసం కింద ఇళ్ల నిర్మాణం ప్రభుత్వం చేపట్టి శాశ్వత పరిష్కారం చూపిస్తుందని హామీ ఇచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ అనుదీప్ మండలంలో పర్యటించి పునరావాసం కింద ఇళ్ల నిర్మాణం కోసం స్థలాలను సైతం పరిశీలించారు. కానీ ఆ ప్రతిపాదన ముందుకు మాత్రం సాగలేదు. సీతమ్మ సాగర్ ప్రాజెక్టు నిర్మాణ పనులు ఆగిపోవడం కాంక్రీట్ గోడ నిర్మాణం ఊసే లేక పోవడంతో ముంపు గ్రామాల ప్రజల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

వరద ప్రాంతాల్లో పర్యటించని కలెక్టర్..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన జితేష్ వి.పాటిల్ మండలంలోని గోదావరి వరద ముంపు ప్రాంతాలను పరిశీలించడానికి వచ్చారు. కానీ కేవలం పర్ణశాల విద్యుత్ సబ్‌స్టేషన్, పర్ణశాల పాఠశాలను మాత్రమే సందర్శించి సమయభావం వల్ల ముంపు ప్రాంతాలైన సున్నంబట్టి, కాశీనగరం గ్రామాలను సందర్శించకుండానే వెనుదిరిగారు.

వర్షాలు పడుతుండటంతో గోదావరికి వరదలు వచ్చే అవకాశాలు ఉండటంతో అధికారయంత్రాంగం ప్రజలకు భరోసా కల్పించాల్సిన అవసరం పూర్తిస్థాయిలో ఉంది. మరోవైపు సీతమ్మ సాగర్ ప్రాజెక్టు నిర్మాణం వల్ల దాని బ్యాక్ వాటర్ భారీగా వచ్చే అవకాశాలు ఉన్నాయి. దీంతో ముంపు ప్రాంతాలైన సున్నంబట్టి నుంచి కాశీనగరం వరకు కాంక్రీట్ గోడ నిర్మించడానికి నాడు ఆలోచన చేశారు. అయినప్పటికీ ఇప్పుడు సీతమ్మ సాగర్ ప్రాజెక్టు నిర్మాణ పనులు సైతం అర్ధంతరంగా నిలిచిపోవడంతో ఆ గ్రామాల ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. పాలకులు, అధికారయంత్రాంగం ముంపు గ్రామాల ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపాలని, ప్రతీ ఏడాది వచ్చే వరదలతో సర్వస్వం కోల్పోవడం తమ వల్ల కాదని వేడుకుంటున్నారు.

ముంపు నుంచి విముక్తి చేయండి



ప్రతీ ఏడాది వచ్చే గోదావరి వరదలతో తీవ్రంగా నష్టపోతున్నాం. ప్రతి సారి వరదల సమయంలో అధికారులు రావడం పునరావాసకేంద్రాలకు తరలించడం చేస్తున్నారు తప్పా శాశ్వత పరిష్కారం వైపు దృష్టి పెట్టడం లేదు. 2022లో వచ్చిన గోదావరి వరదలతో సర్వస్వం కోల్పోయాం. మళ్లీ వర్షాకాలం మొదలైంది. ఇకనైనా వరదల నుంచి విముక్తి కలిగించాలి.

– గడ్డం అదాము, కాశీనగరం గ్రామస్తుడు

ఏజెన్సీ ప్రాంతంలో ఇబ్బందులు



మండలం మొత్తం ఏజెన్సీ ప్రాంతం కావడం, కాని ముంపు గ్రామాల ప్రజల్లో గిరిజనేతరులు కూడా ఉండడం సమస్యగా మారింది. వారికి శాశ్వత ప్రాతిపదికన ఇళ్ల స్థలాల కేటాయింపు అడ్డంకిగా మారింది. గతంలోనే ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపడం జరిగింది. ఉన్నతాధికారుల దృష్టిలో ఈ సమస్య ఉంది. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

– చంద్రశేఖర్, తహసీల్దార్, దుమ్ముగూడెం

ఆగస్టు నాటికి అందుబాటులోకి తేవాలి



ఏకలవ్య పాఠశాల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

ములకలపల్లి: ఏకలవ్య పాఠశాల భవవ నిర్మాణాలను ఆగష్టు మాసం నాటికి ఖచ్చితంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అధికారులకు సూచించారు. మండలపరిధిలోని మూకమామిడి ప్రాజెక్ట్ సమీపంలోని 13 ఎకరాల్లో 32 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఈఎంఆర్‌ఎస్) భవన నిర్మాణాన్ని బుధవారం క్షేత్రస్థాయిలో సందర్శించారు. మ్యాపును పరిశీలించారు. గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి ఏకలవ్య పాఠశాలలు ఎంతగానో ఉపకరిస్తాయని, ములకలపల్లి మండలపరిధిలో పక్కాభవనాలు లేకపోవడంతో, దమ్మపేట మండలంలోని అంకంపాలెం గ్రామంలో రెండేళ్లుగా ఏకలవ్య నడుపుతున్నారని ఎమ్మెల్యే జారె తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం యుద్ధప్రాతిపదిన పనులన్నీ పూర్తి చేయాలని అన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, ఎంపీటీసీ తాటి తులసి, గాడి తిరుపతిరెడ్డి, రాంబాబు ఉన్నారు.

కరకట్ట నిర్మాణ పనుల పరిశీలన

భద్రాచలంఅర్బన్: పట్టణ ప్రజలను ముంపు నుంచి రక్షణకు శాశ్వాత ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం బృందం కరకట్ట నిర్మాణ పనులను పరిశీలించింది. అనంతరం బృందం సభ్యులు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న పాత కరకట్టను ఎత్తు పెంచి దాన్ని పొడిగించాలని, కరకట్టను పటిష్ట పరచాలని అన్నారు. ప్రతి సంవత్సరం కరకట్ట స్లూయిజ్‌లు లీకయి ముపుకు దారితీసున్న నేపథ్యంలో పూర్తిస్థాయిలో స్లూయిస్‌లను మరమ్మతు చేయాలని, భారీ మోటార్లను ముందస్తుగానే ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ముంపు బాధితులకు డబుల్ ఇళ్లు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలోపార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎంబి.నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యుడు బండారు శరత్ బాబు, వై.వెంకట రామారావు పి.సంతోష్ కుమార్, సీనియర్ నాయకులు బిబిజి తిలక్ తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ



భద్రాచలంటౌన్: విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్

భద్రాచలంటౌన్: చదువుకునే ప్రతీ విద్యార్థి లక్ష్యం ఏర్పాటు చేసుకుని కష్టపడి చదివాలని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రభుత్వం ఉచిత పాఠ్య పుస్తకాలతో పాటు ఐటీసీ వారు వితరణగా అందించిన నోట్‌బుక్‌లను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి, పోచాలరావు, వరరాజు, పవన్‌కుమార్, ఆనంద్, హరీష్ కుమార్, లలీత్, రత్న పాల్గొన్నారు.

ప్రాణిక్ హీలింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

కరకగూడెం: మండల పరిధిలోని గొల్లగూడెం గిరిజన ప్రాథమిక పాఠశాలలో 'ప్రాణిక్ హీలింగ్ ఫౌండేషన్ ఆఫ్ సికింద్రాబాద్'ఆధ్వర్యంలో బుధవారం స్టేషనరీ అందించారు. ఆ పాఠశాల విద్యార్థులతో పాటు రంగాపురం,గొల్లగూడెం అంగన్‌వాడీ చిన్నారులకు, నర్సాపురం వలస ఆదివాసీ, రంగాపురం ఎస్సి కాలనీ విద్యార్థులకు మొత్తం 70 మందికి స్కూల్ బ్యాగులు, నోట్ పుస్తకాలు, పలకలు డ్రాయింగ్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యుడు షేక్ సోందుపాషా మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఇర్ప కృష్ణయ్య, గ్రామస్తులు గుండ్ల రంజిత్ కుమార్, ఫౌండేషన్ సభ్యులు సమీర్ పాల్గొన్నారు.

నిలిచిన అభివృద్ధిపై దృష్టి పెట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

అశ్వారావుపేటరూరల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కోట్లాధి రూపాయాలతో చేపట్టిన అభివృద్ధి పనులు నిలిచిపోయామని, ఈ పనులపై దృష్టి పెట్టి పూర్తి చేయాలని అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ప్రస్తుత ప్రభుత్వానికి సూచించారు. బుధవారం స్థానిక ఓ ప్రైవేటు లాడ్జీ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన హాయంలో అశ్వారావుపేటకు సెంట్రల్ లైటింగ్, వంద పడకల ఆస్పత్రి, రహదారులు, సీసీ రోడ్ల తోపాటు పలు అభివృద్ధి పనులు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ పనులను గడిచిన ఆరు నెలల కాలంలో పూర్తిగా స్తంభించిపోయాయని, తక్షణమే ఈ పనులపై స్థానిక ఎమ్మెల్యే దృష్టి సారించి సకాలంలో పూర్తి చేయాలని కోరారు. తాను పార్టీ మారుతున్నట్లు వచ్చిన ఆరోపణలను నమ్మవద్దని, తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తున్నానని చెప్పారు. సమావేశంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి, మాజీ జెడ్పీటీసీ జేకేవీ రమణారావు, నాయకులు సత్యవరపు సంపూర్ణ, తాడేపల్లి రవి, ఎస్‌కే హుస్సేన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

దమ్మపేట: ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో వ్యకికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని ఆసన్నగూడెం గ్రామ శివారులో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఏపీలోని ఏలూరు జిల్లా, చింతలపూడి మండలం, గురుబట్లగూడెం గ్రామానికి చెందిన మేడి రాంప్రసాద్, దమ్మపేట మండలంలోని తొట్టిపంపు గ్రామానికి చెందిన కారం భాస్కరరావులు వారి బైకులపై అసన్నగూడెం గ్రామ శివారులో బుధవారం రాత్రి ఎదురెదురుగా వస్తున్నారు. ఈ క్రమంలో రెండు బైకులు ఒకదానికొకటి బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారం భాస్కరరావుకు తీవ్ర గాయాలు కాగా రాంప్రసాద్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించగా.. ఇరువురిని అంబులెన్స్‌లో సతుపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడు భాస్కరరావు పరిస్థితి విషమంగా ఉండటంతో, వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం అందించేందుకు ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.


టాటా మ్యాజిక్ ఢీకొని మహిళకు..

చర్ల: మండలంలోని కలివేరు మూలమలుపు వద్ద రోడ్డు దాటుతున్న మహిళలను వేగంగా వస్తున్న టాటా మ్యాజిక్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలైన సంఘటన బుదవారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. కలివేరు మూలమలుపు వద్ద కలివేడురుకు చెందిన గడ్డల లక్ష్మి అనే మహిళ రోడ్డు దాటుతోంది. ఈ సందర్భంలో చర్ల వైపు నుంచి భద్రాచలం వైపునకు వెళ్తున్న టాటా మ్యాజిక్ వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో మహిళ తలకు తీవ్ర గాయాలవ్వడంతో సత్యనారాయణపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్య కోసం భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించారు.

చెత్తసేకరణ ఆటోట్రాలీ ప్రారంభం

బూర్గంపాడు: గ్రామాల్లో ఘన వ్యర్థాల నిర్వహణ పక్కాగా చేపట్టాలని ఎంపీడీఓ జమలారెడ్డి అన్నారు. తాళ్లగొమ్మూరు గ్రామపంచాయతీలో చెత్త సేకరణకు కొత్తగా కొనుగోలు చేసిన ఆటోట్రాలీని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంట్లో నుంచి చెత్తను గ్రామపంచాయతీ ట్రాలీలకు అందించాలని, రోడ్లవెంట పారబోయవద్దని సూచించారు. కార్యక్రమంలో తాళ్లగొమ్మూరు గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్ సలోమి, పంచాయతీ కార్యదర్శి తలగాని మురళి, బెల్లంకొండ రామారావు, బెల్లంకొండ ప్రసాద్, చల్లకోటి పూర్ణచంద్రరావు, కేసగాని శ్రీనివాస్‌గౌడ్, పాటి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బూసురాయి గ్రామం సందర్శన



బూసురాయి గ్రామంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

గుండాల: మారుమూల ప్రాంతం, గొత్తికోయ గ్రామమైన బూసురాయిలో ఆళ్లపల్లి మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, పోలీసులు సందర్శించి వైద్యశిబిరం ఏర్పాటుతో పాటు సికెల్‌సెల్, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. గ్రామంలోని అందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారి రేవంత్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సత్యనారాయణలు పరిశుభ్రత, ప్రబలుతున్న సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. నేషనల్ సికెల్ సెల్ అనేమియా ఎలిమినేషన్ మిషన్ గురించి అవగాహన కల్పించారు. కాళ్లవాపు తరుచూ వస్తాయని, యుక్త వయస్సు వారికి పెరుగుదలలో జప్యం, దృష్టి లోపం, గుండెపోటు చాతినొప్పి తదితర లక్షణాలు వస్తాయని ఆయా వ్యాధులకు మందులు ఒకటే మార్గం అన్నారు. ఈ సమస్యలపై లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వాసుపత్రికి రావాలన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు రెండు రోజుల పాటు గ్రామాల్లో అవగాహన గ్రామ సభలు నిర్వహిస్తామని తెలిపారు. సికెల్‌సెల్ అనీమియా వ్యాధి లక్షణాలపై ప్రజలను చైతన్య పరుస్తామని అన్నారు. అనంతరం టేకులపల్లి సీఐ సురేష్, ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి, వైఎస్ ఎంపీపీ రేసు ఎల్లయ్య, ఎస్సై రతీష్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.

అంగన్‌వాడీలకు శిక్షణ

దమ్మపేట: మండల పరిధిలోని అంగన్‌వాడీలకు, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బుధవారం మండలంలోని మల్లారం రైతు వేదికలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో సీడీపీఓ జ్యోతి మాట్లాడుతూ.. పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యను అందించడంలో పాటించవలసిన సమగ్ర విధానాలు, మెళకువలను వివరించారు. పిల్లల సంరక్షణ, వారిలో పోషక విలువలు పెంపొందించడం తదితర అంశాల గురించిర్చి తెలియజేశారు. కార్యక్రమంలో ట్రెనింగ్ సూపర్వైజర్లు వరలక్ష్మి, మాధవి, ప్రాజెక్టు సూపర్వైజర్లు శ్రీదేవి, సాలమ్మ, హైమావతి, కోఆర్డినేటర్ వీరేంద్ర, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా రామారావు

అశ్వాపురం: భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడిగా మండల పరిధిలోని అమెర్ద గ్రామానికి చెందిన కల్లూరి రామారావును నియమించారు. బుధవారం కొత్తగూడెంలో జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కేవీ.రంగాకిరణ్.. రామారావుకు నియామకపత్రం అందజేశారు. కల్లూరి రామారావు ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో మండల ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టారు.

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా రామ్మూర్తి

చంద్రుగొండ: యూత్ కాంగ్రెస్ చంద్రుగొండ టౌన్ ప్రెసిడెంట్‌గా దడిగెల రామ్మూర్తి నియమితులయ్యాడు. ఈ మేరకు యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు షేక్ ఆబీద్ బుధవారం రామ్మూర్తి నియామకపు లేఖను విడుదల చేశారు. ఈ సందర్భంగా రామ్మూర్తి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఇచ్చిన పదవిని సద్వినియోగం చేస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నాడు.

మంత్రిని కలిసిన ఉపాధ్యాయులు

చంద్రుగొండ: గిరిజన సంక్షేమశాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని టీఎస్‌టీడబ్లూటీయూ నాయకులు బుధవారం మంత్రి సీతక్కను హైదరాబాద్‌లో కలిశారు. ఇప్పటికే అనేక సమస్యలను పరిష్కరించడం పట్ల తొలుత మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, ఈ దిశగా ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించాలని మంత్రికి విన్నవించారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డీవీ రావు, ప్రధాన కార్యదర్శి జీ రాములు, బయ్యన్న, వెంకటేశ్వర్లు, ఇస్లావత్ వీరన్ననాయక్ ఉన్నారు.

బియ్యం వితరణ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ఎంపీ కాలనీకి చెందిన మాలమహానాడు జిల్లా నాయకుడు కాపుల గోపి ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందగా.. దశదిన కార్యక్రమానికి చేతన మీసేవ ఆధ్వరంలో 50 కిలోల బియ్యాన్ని కుటుంబ సభ్యులకు బుధవారం వితరణ చేశారు. మదర్ థెరిస్సా వ్యవస్థాపక అధ్యక్షుడు కొప్పుల మురళి, చేతన మీసేవ నిర్వాహకులు భూక్యా రంజిత్ నాయక్ పాల్గొన్నారు.

అధికారులకు సన్మానం

మణుగూరురూరల్: సింగరేణి సంస్థలో సుదీర్ఘ కాలం పని చేసి ఈ నెలాఖరున పదవి విరమణ చేయనున్న జీఎం(సీహెచ్‌పీ) సీహెచ్ నవీన్‌కుమార్‌ను మణుగూరు ఏరియా జీఎం కార్యాలయంలో ఏరియా జీఎం దుర్గం రామచందర్ బుధవారం శాలువాతో సన్మానించి జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో ఏరియా ఎస్వోటూ జీఎం డి.శ్యామ్ సుందర్, ఏజీఎం(సివిల్) డి.వెంకటేశ్వర్లు, ఏరియా ఇంజనీర్ నర్సిరెడ్డి, కేపీయూజీ ప్రాజెక్ట్ అధికారి టి.వీరభద్రరావు, డీజీఎం(పర్సనల్) ఎస్.రమేష్, డీజీఎం(ఐఈడీ) కె.వెంకట్రావు, డీజీఎం(పర్చేస్) శ్రీనివాసమూర్తి, డీజీఎం(కేసీహెచ్‌సీ) మధన్ నాయక్, ఇంజనీర్ వీరభద్రుడు పాల్గొన్నారు.

మణుగూరుటౌన్: మణెగూరు ఏరియా ఇంజనీర్‌గా 37 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకున్న, ఈనెల 30వ తేదీన పదవీ విరమణ పొందుతున్న నర్సిరెడ్డిని ఏరియా జీఎం దుర్గం రాంచందర్, ఇతర అధికారులు బుధవారం జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో ఘనంగా సన్మానించి సత్కరించారు. అనంతరం వారు మాట్లాడారు. కార్యక్రమంలో అధికారులు శ్యాంసుందర్, వెంకటేశ్వర్లు, వెంకటరమణ, రమేశ్, వెంకట్రావు, శ్రీనివాసమూర్తి, అనురాధ, అబ్దుల్ షబ్బీరుద్దీన్, రాంబాబు మినిస్ట్రీయల్ స్టాఫ్ ఉన్నారు.

ప్రైవేటీకరణకు సహకారం మానుకోవాలి

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని అధికారులు పరోక్షంగా ప్రైవేటీకరణకు అందిస్తున్న సహకారం మానుకోవాలని ఏఐటీయూసీ మణుగూరు బ్రాంచ్ సెక్రటరీ వై.రాంగోపాల్ అన్నారు. బుధవారం పీవీకాలనీలోని కెఎల్ మహేంద్ర భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆపరేటర్లు లేరని ఉత్పత్తిపై ప్రభావం పడుతోందని సింగరేణి ఉన్నతాధికారులకు తప్పుడు సాంకేతాలిస్తూ పరోక్షంగా ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేయిస్తున్నారని విమర్శించారు. సమస్యలపై దృష్టి సారించి సరైన మిషన్లు, డంపర్లు, రోడ్లు అందించాల్సింది పోయి.. మణుగూరుకు ఎవరూ ఆపరేటర్లు రావట్లేదని, మిషనరీ సరిగా నడవడం లేదని, ఉత్పత్తి తక్కువ వస్తోందని కల్పితాలు సృష్టిస్తూ కొందరు స్థానిక అధికారులు ప్రైవేటీకరణకు ఉసిగొల్పుతున్నారన్నారు. సమస్యను పరిష్కరించని పక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ రామనర్సయ్య, నాయకులు మేకల ఈశ్వర్, పుల్లారావు, ఆవుల నాగరాజు, ఆదర్ల సురేందర్, గంగాధర్‌రావు, సుభానీ తదితరులు ఉన్నారు.

మాదకద్రవ్యాలను నిర్మూలిద్దాం

అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని బుధవారం అధికారులు, ఉపాధ్యాయులు నిర్వహించారు. అవగాహన కల్పిస్తూ నినాదాలతో ర్యాలీ తీశారు. విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. వ్యాస రచన పోటీలు ఏర్పాటు చేసి, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పలువురు మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. మాదక ద్రవ్యాలకు బానిసలైన వారిని కాపాడుకునేందుకు 104466 ప్రభుత్వ టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



మణుగూరుటౌన్: పట్టణంలో 2కె రన్ నిర్వహిస్తున్న పోలీస్, రెవెన్యూ అధికారులు



దమ్మపేట: మాదకద్రవ్యాల నిర్మూలనపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే



చంద్రుగొండ: ర్యాలీ సందర్భంగా మాట్లాడుతున్న ఎంపీడీఓ అశోక్



మణుగూరురూరల్: కూనవరంలో మాదక ద్రవ్యాల నివారణపై ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



భద్రాచలంఅర్బన్: స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో ర్యాలీ..